## చిత్ర కథ పోటీ:

# చిట్టిబుర్రలో చిన్న ఆలోచన

వై. రేణుకాదేవి

> గత సంచికలో ఇచ్చిన 'చిత్ర కథ పోటీ'కి వచ్చిన కథల్లో 'చిట్టి బుర్రలో చిన్న ఆలోచన' అన్న కథ బాగున్నదనిపించింది. ఈ కథను వై. రేణుకాదేవి రాశారు. ప్రకటించిన ప్రకారం ఇస్తామన్న 'బహుమతి'ని ఆమెకు పంపుతాము.

"అక్కా! అక్కా!" అని పిలుస్తూ ఇంటి ముందర గార్డెన్‌లో పచార్లు చేస్తున్న లత దగ్గరకు పరుగెత్తుకొచ్చాడు పదేళ్ళ రాము. వాడి కోసమే కాచుకునున్నట్లుగా ఎగిరి గంతేసింది లత వాడి పిలుపు విని.

"అక్కా! ఎదురింటి బాబూరావుగారు నీకి ఉత్తరం ఇమ్మన్నారు" అన్నాడు రాము.

ఉత్తరాన్ని గబుక్కున వాడి చేతిలోంచి లాక్కుని జాకెట్టు-లోపలికి దోపుకుంటూ చుట్టూ చూసిందొకమారు లత. ఎవ్వరూ ఉన్నట్లు లేరు. రహస్యంగా రాము నడిగింది లత. "రామూ! నీవీ ఉత్తరం తేవడం ఎవరికంటా పడలేదు కదా!" లేదన్నట్లుగా వాడు తలూపాడు.

సంతోషంగా వాడి వీపుతట్టి "నీకు డబ్బిలిస్తానుగాని సాయంత్రం సినిమా కెళ్లు. కానీ ఈ ఉత్తరం మాట ఎవరిదగ్గరా బయటపెట్టకూడదు సుమా!" కళ్ళలోనే వాడికి జాగ్రత్త అని చెప్తూ మేడ మీదకి పరుగెట్టింది లత.

పదేళ్ళ రాముకు లత సంగతి ఏమీ అర్థం కాలేదు. ఉత్తరానికి, లతకూ వున్న సంబంధ మేమిటో వాడి చిన్న బుర్రకు అంతుబట్టలేదు. ఎవరితోనూ ఉత్తరం సంగతి చెప్పగూడదంటుందే లతక్క.....ఎందుకు? ఈ ఉత్తరాన్ని ఆమేం చేస్తుందో చూద్దాం అనుకుంటూ వాడు కూడా మెల్లిగా అడుగులో అడుగేసుకుంటూ మేడ ఎక్కి లత గది ముందు ఓరగా వేసిన తలుపువద్ద ఆగి లోపలికి చూసాడు. లత పక్కమీద బోర్లా పడుకుని కాళ్లు ఆడిస్తూ, సిగ్గుని పెదాలమాటున అదిమిపట్టి, తన పెద్ద కళ్ళను అర్ధనిమీలితంచేసి, ఉత్తరాన్ని ఎడమ చేతిలో పట్టుకుని, కుడిచేత వేలి గోళ్లు కొరుకుతూ మనసులో చదువుకుంటూంది.

ఆ దృశ్యం చూసిన రాముకు వెంటనే మెదడులో ఒక దృశ్యం మెదిలింది. ఇలాగే నాలుగు రోజుల క్రితం ఉత్తరం తెచ్చినందుకు లత వాడికి సినిమా చూడమని డబ్బులిచ్చింది. ఆ రోజు రాము ఒక సినిమా చూసాడు. అందులో ఒక అమ్మాయి ఇలాగే ఒక ఉత్తరాన్ని తన లాంటి అబ్బాయి తెచ్చివ్వగా చదువుతుంది. ఆ ఉత్తరాన్ని చదివిన రాత్రే ఆ అమ్మాయి ఉత్తరం వ్రాసినతనితో వెళ్ళిపోతుంది. ఆ అమ్మాయి వెళ్ళిపోయిన తరువాత, ఆ అమ్మాయి తలిదండ్రుల దుఃఖం చూచి తను కూడా సినిమా హాల్లో ఏడ్చాడు. తరువాత ఆ అబ్బాయి ఆ అమ్మాయిని ఎక్కడికో తీసికెళతాడు. కొద్ది రోజులు బాగానే వున్నట్లు చూపారు సినిమాలో. తరువాత ఏమయిందో తెలీదు. ఆ అమ్మాయి చాలామంది ఆడవాళ్ళున్న ఇంటిలో ఏడుస్తూ కనిపిస్తుంది. అతడు ఆ తర్వాత కన్పించనే



కనిపించదు. ఆ అమ్మాయి వున్న యింట్లో ఒక లావుపాటి ముసిల్ది వుంటుంది. అది ఆ అమ్మాయిని ఒక గదిలోకి వెళ్ళమంటే ఆ అమ్మాయి వెళ్ళదు. అప్పుడా ముసిల్ది ఒక గూండాలాంటి వాడిచేత ఆమెను కొట్టించి ఆ రోజంతా ఆమెకు అన్నం పెట్టదు. ప్రతిరోజూ ఆ అమ్మాయి అలా దెబ్బలు తింటూ ఏడుస్తూ వుంటుంది. ఆ దృశ్యం గుర్తుకు వచ్చేసరికి చిన్నారి రాము శరీరం మీద చెమటలు పోసాయి. అమ్మో! ఇంకేమయినా వుందా! తన అక్కకు కూడా అలాగే అవుతుందా? సినిమాలో మాదిరే అక్క కూడా ఉత్తరం చదివి అతనితో వెళ్ళిపోదు కదా? అప్పుడు తను అక్కా! అని ఎవర్ని పిలుస్తాడు. అక్క వెళ్ళిపోతే పెద్దమ్మగారు, పెదబాబుగారు ఎంతగా ఏడుస్తారో? తను అది చూసి భరించగలడా? ఎక్కడో అడుక్కు తింటూ పడివున్న తనను ఆదరించి తీసుకొచ్చి దగ్గర పెట్టుకున్న ఆ పుణ్య దంపతులు ఏడుస్తూవుంటే తాను సహించగలడా? ఇదంతా తనే ఉత్తరం తెచ్చివ్వడం మూలానకదా జరిగింది. ఈ సంగతి తెలిస్తే పెదబాబుగారు ఊరుకుంటారా.... తనని తన్ని తగలెయ్యరూ! అక్క సుఖంగా వుండేటట్లయితే తానేమయినా ఫరవాలేదు. కాని సినిమాలోలాగ అక్క కూడా దెబ్బలు తింటూ ఏడుస్తే తనని దేవుడు కూడా క్షమించడు. అమ్మా నాన్న చిన్నప్పుడే పోయిన రాముకు తన ఒక్కగానొక్క అక్క గుర్తుకొచ్చింది. ఎంతో ప్రేమగా తనని చూసుకుంటూ వున్న అక్క ఒక రోజు ఇలాగే చెప్పాపెట్టకుండా ఎక్కడికో వెళ్ళిపోయింది. తాను అనాధ అయినాడు అప్పట్నుంచి. ఆ అక్క కూడా సినిమాలోలాగ ఎవరింట్లోనో దెబ్బలు తింటూ వుందేమో! ఆ అక్క వెళ్ళిపోయినప్పుడు తాను చాలా చిన్నవాడు. తనకు ఏమీ తెలీదు. కానీ ఇప్పుడు తనకు కొంచెం కొంచెంగా ప్రపంచం తెలుస్తూ వుంది. వెళ్ళిపోయిన ఆ అక్కను ఈ అక్కలో చూసుకుంటున్నాడు తను. ఈ అక్క వెళ్ళిపోతే తను బ్రతగ్గలడా? ఊహూ! అక్క వెళ్ళిపోకుండా ఆపాలి. తనా ఉత్తరం తెచ్చివ్వకుండా వుండాల్సింది. కానీ ఏమిటో తనది తెచ్చిచ్చాడు. ఇప్పుడేం చేయాలి? సినిమాలోలాగ జరగకుండా వుండేందుకు ఏదైనా ఉపాయం ఆలోచించాలి. ఎలా? హఠాత్తుగా వాడి చిట్టి బుర్రలో చిన్న ఆలోచన ప్రవేశించింది. సంతృప్తిగా తల వూపుతూ దాన్ని అమలుపరచేందుకు నిశ్చయించుకున్నాడు రాము.



## ఆటోరిక్షా నడుపుతున్న తొలివనిత షఫీయాబీ

"ఉత్సాహం కల్గించే వృత్తి మాత్రమే కాదు. కుటుంబ ఆదాయం కూడా దీని ద్వారా అభివృద్ధి చేసుకోవచ్చు. ఇది ఈనాటి ఆర్థికపరిస్థితిలో చాలా అవసరం కూడా—" అన్నారు మద్రాసు తొలి ఆటోరిక్షా లేడీ డ్రైవర్ శ్రీమతి షఫీయా బీ 'వనిత' ప్రతినిధితో మాట్లాడుతూ.

ముప్పైఎనిమిదేళ్ళు నిండిన నలుగురు పిల్లల తల్లి అయిన ఈమె ఆటో నడపడం నేర్చుకున్నదంటే ఆశ్చర్యం లేదు. ఎంచేతంటే ఈమె భర్త మద్రాసులో ఒక డ్రైవింగ్ స్కూల్ నడుపుతున్నారు. అయితే డ్రైవింగ్‌ను వృత్తిగా చేపట్టే ఉత్సాహం కల్గించింది ఒక మంత్రిగారు.

గత సంవత్సరం పోలవరంలో జరిగిన స్త్రీల మోటారు పోటీల బహుమతీ ప్రదానోత్సవంలో "డ్రైవింగ్‌ను కేవలం వినోదాలకు, పోటీలకు మాత్రమే పరిమితం చెయ్యకుండా వృత్తిగా స్వీకరించడానికి స్త్రీలు ముందుకురావాలి" అని ఆయన ప్రసంగించారు. ఆ మాటలకు ఉత్తేజితురాలైన షఫీయా బీ-పట్టుదలతో డ్రైవింగ్ నేర్చుకుని గత నవంబర్ పదో తారీఖున ఆటో నడపడం ప్రారంభించారు.

"నడపడం సులభంగా నేర్చుకున్నాను. కాని ఆటో కొనడానికి మాత్రం కొంత శ్రమపడ్డాను. ఋణం కోసం అర్జీ పెట్టినప్పుడు మొదట బ్యాంక్ వాళ్ళు నిరాకరించారు. లైసెన్సు విషయంలోనూ అదే జరిగింది. కాని నేను ఈ విషయాన్ని ముఖ్య మంత్రి దృష్టికి తెచ్చాను. ఆపైన పనులన్నీ చకచకా అయిపోయాయి." అందామె నవ్వుతూ. రిక్షా కొనడానికి పొందిన ఋణంలో ఆమె యిప్పుడు వారానికి నూటపన్నెండు రూపాయలు చెల్లిస్తూందట.

ఉదయం తొమ్మిది గంటలకల్లా ఇంటి పనులు ముగించుకుని పిల్లల్ని బడికి పంపి ఆటోలో బయలుదేరే షఫీయా సాయంకాలం పిల్లలు బడినుంచి వచ్చే లోపల ఇల్లు చేరుకుంటుంది. అంచేత గృహిణిగా తన నిత్య కృత్యాలకు ఇది ఏ విధంగానూ ఆటంకం కాదు అన్నారామె. ఇలా నడపడంవల్ల రోజుకు కనీసం పదిహేను రూపాయలు ఆదాయం వస్తుందట.

"రెండు మూడు మాసాలుగా ఆటో నడుపుతున్నారు కదా మీ అనుభవాలు ఏమిటి?" అని అడిగినప్పుడు—"ఎలాంటి చేదైన అనుభవాలూ ఎదురు కాలేదు. పైగా మద్రాసు ఆటో డ్రైవర్లు చాలామంది మా వారి స్కూల్లో నేర్చుకున్న వాళ్ళే గనక నా దగ్గర ఎంతో గౌరవంగా నడుచుకుంటారు. 'స్త్రీలకు, కుటుంబాలకు మాత్రమే' అని బోర్డు తగిలించడం కేవలం రక్షణ కోసమే. ఇకపోతే ఈ వృత్తిని నేను ప్రజాసేవగా భావిస్తున్నాను. అందుకే మీటర్ ఛార్జికన్నా ఒక్క పైసా కూడా ఎక్కువ తీసుకోను." అన్నారామె.

"డ్రైవింగ్ నేర్చుకోవాలని ఉత్సాహం వున్నా ఆర్థికంగా ముందుకు అడుగు వేయలేని పేద స్త్రీలకు మొదట ఫీజు తీసుకోకుండా డ్రైవింగ్ నేర్పించి - వాళ్ళు స్వయంగా నాలుగు డబ్బులు సంపాయించేప్పుడు ఫీజు చెల్లించే సౌకర్యం కల్పిస్తాము. పేద స్త్రీల ప్రగతికి మేము చేసే చిన్న సాయం ఇది" అంటారు షఫీయా.

తొలి ఆటోరిక్షా లేడీ డ్రైవర్‌గా తాను వుండడమే కాదు, తనలా తోటి వనితలు కూడా ఈ మార్గంలో పయనించాలని ఉబలాటపడే షఫీయా బీ ఇరవై యేళ్ళ క్రితమే ఒక సాహసం చేసింది. సనాతన హైందవ కుటుంబంలో పుట్టి పెరిగిన ఈమె ఒక ముస్లిమ్‌ను పెళ్ళాడింది ఆ రోజుల్లో అదీ ఒక విప్లవమే!